నమస్తే తెలంగాణ
# రాజన్న సిరిసిల్ల
10 | కరీంనగర్, గురువారం 8 మే 2025 | RAJANNA SIRCILLA

## ఉగ్రవాద శిబిరాలను పూర్తిగా ధ్వంసం చేయాలి

- దేశ భద్రతకు ఏ నిర్ణయం తీసుకున్నా బీఆర్ఎస్ పూర్తి మద్దతు
- మాజీ ఎంపీ వినోద్‌కుమార్

కరీంనగర్ కార్పొరేషన్, మే 7 : పాకిస్థాన్‌లోని ఉగ్రవాద శిబిరాలను పూర్తిగా ధ్వంసం చేయాలని మాజీ ఎంపీ వినోద్‌కుమార్ కోరారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పహల్గాం ఘటన తర్వాత కేంద్రం దేశ భద్రతకు సంబంధించి ఏ నిర్ణయం తీసుకున్నా బీఆర్ఎస్ మద్దతు ఇస్తుందని ఇదివరకే ప్రకటించామని, గతంలో సర్జికల్ స్ట్రైక్ కూడా తమ పార్టీ మద్దతు ఇచ్చిందని గుర్తు చేశారు. ఆపరేషన్ సింధూర్‌కు తమ సంపూర్ణ మద్దతు ఇస్తున్నామని తెలిపారు. దేశ భద్రతే అన్నింటికన్నా ముఖ్యమన్నారు. పాక్ ప్రతిదాడులను కూడా సైన్యం సమర్థవంతంగా తిప్పికొడుతుందనే నమ్మకం ఉందన్నారు. తెలంగాణ ప్రాంతంలో ఒక్క సైనిక్ స్కూల్ కూడా లేదని, ఏపీలో కోరుకొండ, పులివెందుల, కలికిరిలో ఉన్నాయని, ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన కొత్తలోనే అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ సైనిక్ స్కూల్ కోసం కేంద్రంపై ఒత్తిడి తెచ్చారని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో వరంగల్‌కు సైనిక్ స్కూల్ మంజూరు చేసినా అనేక షరతులు పెట్టారని, రాష్ట్ర ప్రభుత్వమే సైనిక్ స్కూల్‌కు అన్ని ఖర్చులూ భరించాలని చెప్తే కేసీఆర్ నిరసన తెలిపారని చెప్పారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే సైనిక్ స్కూల్ గురించి తాను లేఖ రాశానని, దీనిపై తనను హేళన చేస్తూ మాట్లాడారని పేర్కొన్నారు. బొల్లారంలో సైనిక్ స్కూల్ వస్తుందని చెప్పారని, కానీ ఇప్పటి వరకు అతీగతీ లేదన్నారు. ఏపీలో ఉన్న సైనిక్ స్కూల్‌లో తెలంగాణ వారికి ఉన్న రిజర్వేషన్ కోటా ఎత్తేశారని, తెలంగాణ విద్యార్థులకు అన్యాయం జరుగుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర కాంగ్రెస్, బీజేపీలు ఏం చేస్తున్నాయని ప్రశ్నించారు. ఏపీకి కొత్తగా విజయవాడలో సైనిక్ స్కూల్ మంజూరైందని, తెలంగాణలో ఒక్కటి కూడా లేకపోవడం దుర్మార్గమన్నారు. దీనిపై కోర్టులను ఆశ్రయించే దిశగా చర్యలు చేపడుతామని స్పష్టం చేశారు.



ఎల్లారెడ్డిపేటలో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య

## కొనుగోళ్లు వేగవంతం చేయాలి

బీఆర్ఎస్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య

ఎల్లారెడ్డిపేట, మే 7: ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని, రైతుల ఖాతాల్లో నగదును సకాలంలో జమ చేయాలని ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య డిమాండ్ చేశారు. బుధవారం ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఐకేపీ సెంటర్‌ను బీఆర్ఎస్ నాయకులతో కలిసి సందర్శించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పోసి 20 రోజులు దాటినా కొనుగోళ్లు మందకొడిగా సాగుతున్నాయని, అయినా రైతుల ఖాతాల్లో నగదు కూడా జమ కావడం లేదని చెప్పారు. వెంటనే ఆ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వర్స కృష్ణహరి, మాజీ జడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, తదితరులు ఉన్నారు.



సిరిసిల్ల పాలిస్టర్ అసోసియేషన్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న వార్పిన్ కార్మికులు

## కూలి రేట్లు పెంచాలి

సిరిసిల్ల జిల్లాకేంద్రంలో వార్పిన్ కార్మికుల ధర్నా

రాజన్న సిరిసిల్ల, మే 7 (నమస్తే తెలంగాణ) : కూలి రేట్లు పెంచాలని డిమాండ్ చేస్తూ వార్పిన్ కార్మికులు రోడ్డెక్కారు. యజమానుల మొండి వైఖరిని నిరసిస్తూ బుధవారం సిరిసిల్ల పాలిస్టర్ వస్త్ర ఉత్పత్తిదారుల సంఘం కార్యలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. కూలీ పెంచాలని వారం కిందటే యజమానులకు సీఐటీయూ, వార్పిన్ యూనియన్ నాయకులు నోటీసులు ఇచ్చారు. అయినా స్పందించక పోవడంతో వార్పిన్ యూనిట్లు బంద్‌పెట్టి ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా తెలంగాణ వపర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేశ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన చీరల ఆర్డర్లు యజమానుల పథకంగా మారిందని విమర్శించారు. వస్త్ర ఉత్పత్తిదారులు పూర్తిగా కార్మికుల వ్యతిరేకిగా మారారని మండిపడ్డారు. బతుకమ్మ చీరల కన్నా ఈప్రభుత్వం ఇచ్చిన చీరలతో పనిభారం రెండింతలు పెరిగిందని, పనికి తగ్గ కూలీ ఇవ్వాలని అడిగినా యజమానులు ముందుకు రావడం లేదన్నారు. కార్మికులు సమ్మె బాట పట్టినా చేనేత జౌళీశాఖ అధికారుల నిర్లక్ష్యం వీడడం లేదని మండిపడ్డారు. కార్మికుల కూలీని నిర్ణయించాల్సిన అధికారులు యజమానులకు అప్పగించడ వల్ల ఈసమస్య తలెత్తిందని పేర్కొన్నారు. జౌళీశాఖ అధికారులు కార్మికుల సమస్యలు ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. బట్ట ఉత్పత్తి చేసే కార్మికులతో అధికారులు మాట్లాడడానికి సమయం కూడా ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వ పథకాలు కార్మికుల ప్రయోజనం కోసమా..? యజమానుల లాభం కోసమా..? చెప్పాలని నిలదీశారు. యజమానులు తమ స్వప్రయోజనాల కోసమే తప్ప కార్మికుల శ్రేయస్సు గురించి ఆలోచించడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. అధికారులు స్పందించకుంటే గురువారం కలెక్టర్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ, యూనియన్ అధ్యక్షుడు సిరిమల్ల సత్యం, వైపని యూనియన్ అధ్యక్షుడు కుమ్మరికుంట కిషన్, ఉడుత రవి, మచ్చవేణు, ఒగ్గు గణేశ్, ఎలికేటి శ్రీనివాస్, ప్రవీణ్, వెంకటేశ్వర్లు, దోమల రమేశ్, చింతకింది సుధన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ రంగంలో ఉద్యోగావకాశాలు




జగిత్యాల రూరల్, మే 7 : జగిత్యాల జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కల్పించేందుకు ఈ నెల 12న జిల్లా ఉపాధి కల్పన అధికారి కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి బీ సత్తమ్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని కేఎల్ గ్రూప్ సంస్థలో పిక్కింగ్, ప్యాకింగ్, సార్టింగ్ ఖాళీల కోసం ఇంటర్వ్యూలు ఉంటాయని తెలిపారు. పదో తరగతి నుంచి డిగ్రీ చదివిన వారు అర్హులని పేర్కొన్నారు. ఇంగ్లిష్ పరిజ్ఞానం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు. అర్హత, ఆసక్తి ఉన్నవారు ఈనెల 12న జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటలకు జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని సూచించారు.

# మట్టి తోడేళ్లు!

చెరువుల్లో మట్టి తోడేళ్లు పడ్డాయి. పగలూ రాత్రి అనే తేడా లేకుండా మరీ తవ్వేస్తున్నాయి. ఇటుక బట్టీల అవసరాలకు ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని ఆసరాగా చేసుకొని కోట్ల విలువ చేసే మట్టిని తెగ తోడేస్తున్నాయి. ఒక బట్టీ పేరిట అనుమతి తీసుకొని, నిత్యం వందలాది టిప్పర్లలో పరిమితికి మించి తరలించుకుపోతున్నాయి. ఇక పలు సందర్భాల్లో స్వాధీనం చేసుకున్న మట్టికి కొంత మొత్తంలో ఫైన్ తీసుకొని మళ్లీ పర్మిషన్ ఇవ్వడం సర్వసాధారణంగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పెద్దపల్లి కలెక్టర్ కొత్త మట్టి పాలసీ తీసుకువచ్చినా.. తాజాగా రాఘవాపూర్‌లో సీజ్ చేసిన మట్టికి తక్కువ మొత్తంలో జరిమానాతో పాత విధానంలో అనుమతులు ఇవ్వడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

- పెద్దపల్లి జిల్లా చెరువుల్లో దందా
- అనుమతి గోరంత.. తవ్వేది కొండంత
- నిత్యం వందలాది టిప్పర్లలో సరఫరా
- మామూలుగా తీసుకుంటున్న అధికారులు
- సీజ్ చేసినా సాధారణ జరిమానాతో మళ్లీ పర్మిషన్
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి



రాఘవాపూర్‌లో మట్టిని లారీలో పోస్తున్న ఎక్స్‌కవేటర్



ఇటుక బట్టీలకు లారీలో తరలిస్తున్న రాఘవాపూర్ చెరువు మట్టి

పెద్దపల్లి, మే 7 (నమస్తే తెలంగాణ): పెద్దపల్లి జిల్లాలో అత్యధికంగా ఇటుక బట్టీలు విస్తరించి ఉండడంతో మట్టికి భారీ డిమాండ్ ఉంటుంది. ఏటా వేసవిలో చెరువులు ఎండిన వెంటనే పలువురు ఇటుక బట్టీల వ్యాపారులు మాఫియా అవతారం ఎత్తుతున్నారు. మైనింగ్, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులను మామూళ్ల మత్తులో ఉంచి, పెద్ద ఎత్తున మట్టి అక్రమ రవాణా చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. వాస్తవానికి చెరువుల్లోని మట్టి తరలింపు కోసం ఇటుక బట్టీ వ్యాపారులు కమర్షియల్‌గా రాయల్టీ చెల్లించి సంబంధిత శాఖల నుంచి అనుమతులు తీసుకుంటారు. ఆయా చెరువుల నుంచి కేటాయించిన వరకే మట్టి తీసుకెళ్లాల్సి ఉంటుంది. అది కూడా తాను అనుమతి తీసుకున్న బట్టీకి మాత్రమే ఉదయం నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే తరలించుకోవాల్సి ఉంటుంది. అయితే అనుమతి తీసుకున్నామనే పేరిట బట్టీల నిర్వాహకులు పగలు, రాత్రి అనే తేడా లేకుండా పదుల సంఖ్యలో బట్టీలకు యథేచ్ఛగా తోడుకెళ్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. దీనిపై పకడ్బందీగా నిఘా పెట్టాల్సిన ఆయా శాఖల అధికారులు చోద్యం చూస్తుండడంపై ఆరోపణలు ఉన్నాయి. ఇంకా మట్టి మాఫియాకు అధికార పార్టీ నాయకులు అండగా నిలుస్తూ, అనుమతులు ఇప్పిస్తూ సొమ్ము చేసుకుంటున్నట్లు తెలుస్తున్నది.



పెద్దపల్లి మండలంలోని ఇటుక బట్టి

### తవ్వేది కొండంత

గతేడాది పెద్దపల్లి డివిజన్ పరిధిలో మట్టితీతకు పర్మిషన్ ఇవ్వకపోవడంతో పెద్దపల్లి మండలంలోని ఇటుక బట్టీల యజమానులు రామగుండం మండలంలోని ముర్మూరు, మంథని మండలంలోని బిట్టుపల్లి చెరువుల నుంచి మట్టి తరలించారు. అనుమతులు గోరంత తీసుకొని కొండంత రవాణా చేశారనే విమర్శలున్నాయి. అధికారులు మట్టిని సీజ్ చేయగా, కొద్దిరోజుల తర్వాత కొంత మొత్తంలో జరిమానా చెల్లించి ఇటుక బట్టీలకు తరలించుకుపోయారు. ఇక రెండు, మూడేళ్ల క్రితం పెద్దపల్లి మండలం రాఘవాపూర్ చెరువులోనూ ఇలాగే అనుమతి తీసుకున్నది గోరంత అయితే.. కొండంత తవ్వడం, విమర్శలు రావడంతో అధికారులు మట్టిని సీజ్ చేశారు. మరో ఘటనలో రెండేండ్ల క్రితం పెద్దపల్లి మండలం కొత్తపల్లి చెరువులో అనుమతికి మించి మట్టిని తవ్వడంతో అధికారులు సీజ్ చేశారు. ఈ మూడు ఘటనల్లో సీజ్ చేసిన మట్టికి స్వల్పమైన జరిమానాలు తీసుకొని ఈ ఏడాది తిరిగి మట్టిని తరలింపును ఇవ్వడం అనేక విమర్శలకు తావిచ్చింది. అధికార పార్టీ నాయకుల అండదండలతో అధికారులు అనుమతులు ఇచ్చారనే విమర్శలున్నాయి.

### రాఘవాపూర్.. అనుమానాలెన్నో..

పెద్దపల్లి మండలం రాఘవాపూర్ చెరువులో 2023లో ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి తవ్వారు. అంతకుముందు చెరువు మట్టి తీతకు రాఘవాపూర్‌లోని మణితేజ బ్రిక్స్ నుంచి అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. కానీ, ఎలాంటి అనుమతి లేకుండానే పెద్ద ఎత్తున మట్టిని తోడారు. అప్పుడే అత్యధికంగా తరలించగా, వేలాది మెట్రిక్ టన్నుల మట్టిని ఒక చోట నిల్వ చేశారు. ఫిర్యాదులు రావడంతో అధికారులు వెళ్లి పరిశీలించారు. 19,361మెట్రిక్ టన్నులు ఉన్నట్టు గుర్తించి, సీజ్ చేశారు. అయితే ఈ గుర్తింపులోనూ అవకతవకలు జరిగానే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతేడాది పెద్దపల్లి డివిజన్‌లో నుంచి మట్టి, ఇసుక తరలింపునకు అధికారులు అనుమతులు ఇవ్వబోమని చెప్పడంతో సీజ్ చేసిన మట్టి అలాగే ఉండిపోయింది. కానీ, ఇటీవల ఆ మట్టికి తక్కువగా ₹7,74,440 జరిమానా తీసుకొని గత నెల 21నుంచి ఈనెల 20వరకు తరలించేందుకు అనుమతులు ఇచ్చారు. చెల్లించాల్సిన జరిమానాలో ఐదు రెట్లు చెల్లించాల్సి ఉండగా, అందుకు విరుద్ధంగా డబ్బులు కట్టించుకొని అనుమతులు ఇచ్చారనే విమర్శలున్నాయి. ఈ విషయంలో పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక వైపు కలెక్టర్ కొత్తగా మట్టి పాలసీని తీసుకురాగా, పాత విధానంలో మైనింగ్ అధికారులు అనుమతులు ఇవ్వడంలోని ఆంతర్యం ఏంటో అంతుచిక్కడం లేదు. ఉదయం నుంచి సాయంత్రం 5గంటలలోగానే రవాణా చేయాలనే నిబంధనలు ఉన్నా పగలు రాత్రి తరలిపోతున్నా, అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి.

### ఓవర్‌లోడ్‌తో దెబ్బతిన్న రోడ్డు, రొడ్యాం

మట్టి మాఫియా రోడ్లను ఛిద్రం చేస్తున్నది. అనుమతికి మించి ఓవర్‌లోడ్‌తో మట్టిని తరలిస్తుండడంతో గ్రామాల్లోని రోడ్లు, రోడ్యాంలు పూర్తిగా దెబ్బతింటున్నాయి. రాఘవాపూర్ నుంచి మట్టి తరలిస్తుండడంతో గ్రామంలో మూడు నెలల క్రితం వేసిన రోడ్డు, రోడ్యాం దెబ్బతిన్నాయి. దీంతో ఇటీవల గ్రామ ప్రజలు, మాజీ సర్పంచ్ మట్టి తరలింపు ఆపాలని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు.

### మట్టితీతకు 14 చెరువుల గుర్తింపు

గతేడాది వరకు పెద్దపల్లి డివిజన్‌లో మట్టి తరలింపునకు అనుమతులు ఇవ్వమని చెప్పిన మైనింగ్, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు ఈ యేడాది డివిజన్‌లోని 14చెరువులను మట్టి తీతకు గుర్తించడం అనుమానాలకు తావిస్తున్నది. ఇప్పటి వరకు పెద్దపల్లి డివిజన్ పరిధిలోని నాలుగు మండలాల్లో 14 చెరువుల్లో 3 లక్షల 8 వేల క్యూబిక్ మీటర్ల మట్టిని తరలించేందుకు అవకాశం ఉందని చెబుతున్నారు. ఆయా చెరువుల్లో నీళ్లు తగ్గిన తర్వాత అనుమతులు ఇవ్వాలని భావిస్తున్నారు. ఇందులో కాల్వశ్రీరాంపూర్ మండలం తారుపల్లి నక్కల ఒర్రె ప్రాజెక్టులో 40 వేల క్యూబిక్ మీటర్లు, పందిళ్ల పెద్ద చెరువులో 20 వేల క్యూబిక్ మీటర్లు, పెగడపల్లి పెద్ద చెరువులో 60 వేల క్యూబిక్ మీటర్లు, మంగపేట నల్ల చెరువులో 10 వేల క్యూబిక్ మీటర్ల మట్టి, ధర్మారం మండలం ధర్మారం సీతల చెరువులో 30 వేల క్యూబిక్ మీటర్లు, సర్సింగాపూర్ చిన్న చెరువులో 40 వేల క్యూబిక్ మీటర్లు, దొంగతుర్తి పెద్ద చెరువులో 40 వేల క్యూబిక్ మీటర్ల మట్టి ఉందని గుర్తించారు. అయితే ఇటుక బట్టీల యజమానుల పేరిట అనుమతులు పొందేందుకు అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులు అప్పుడే ప్రయత్నాలు మొదలు పెట్టారు.

### కొత్త మట్టి పాలసీ అమలయ్యేనా..?

జిల్లాలో అక్రమంగా మట్టి తరలింపునకు అడ్డుకట్ట వేసేందుకు కలెక్టర్ కోయ శ్రీహర్ష కొత్తగా మట్టి పాలసీని తీసుకువచ్చారు. ఈ వేసవి నుంచే అమల్లోకి తేవాలని నిర్ణయించారు. ఈ విధానం ప్రకారం మట్టి తరలింపునకు తహసీల్దార్లు అనుమతులు ఇవ్వాల్సి ఉంటుంది. వే బిల్ కచ్చితంగా ఉండాలి. దీనిని తహసీల్దార్లే జారీ చేస్తారు. ఏ చెరువు నుంచి ఎక్కడికి మట్టిని తరలిస్తున్నారనే వివరాలు అందులో పేర్కొనాలి. ఒక స్థలం రాసి, మరో చోటికి తరలించకూడదు. నీటి పారుదల, గనులు, భూగర్భ శాఖల అధికారులు సూచించిన మేరకు మాత్రమే మట్టిని తోడుకెళ్లాలి. సీనరేజ్ డబ్బులు మాత్రం గనులు, భూగర్భ శాఖకు చెల్లించాల్సి ఉంటుంది. ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే తరలించాలి. ఆ తర్వాత తరలించినా, పాలసీ నిబంధనలు అతిక్రమించినా చర్యలు తీసుకోవాలని నిర్ణయించగా, ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో పకడ్బందీగా అమలయ్యేనా..? అన్న సందేహాలు తలెత్తుతున్నాయి.

మట్టి రవాణాతో దెబ్బతిన్న రాఘవాపూర్‌లోని రోడ్యాం





జాతీయ రహదారిపై రైతులతో కలిసి ధర్నా చేస్తున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

## తడిసిన ధాన్యం కొనాల్సిందే

- ఎలాంటి షరతులు పెట్టద్దు
- జగిత్యాల తొలి మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత
- రైతులతో కలిసి ధర్నా

జగిత్యాల/ జగిత్యాల టౌన్, మే 7 : అకాల వర్షంతో తడిసిన ధాన్యాన్ని ఎలాంటి షరతులు లేకుండా వెంటనే ప్రభుత్వం కొనాలని జగిత్యాల జిల్లా తొలి జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్ డిమాండ్ చేశారు. మంగళవారం అర్ధరాత్రి పడిన అకాల వర్షానికి చల్‌గల్ వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం తడువగా, బుధవారం ఆమె పరిశీలించారు. ధాన్యం అమ్మేందుకు తెచ్చి నెలల తరబడి నిరీక్షిస్తున్నామని రైతులు ఈ సందర్భంగా గోడు వెళ్లబోసుకున్నారు. తమకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. దీంతో రైతులతో కలిసి వసంత చల్‌గల్ మార్కెట్ ఎదుట ఉన్న నిజామాబాద్ జాతీయ రహరిదారిపై బైఠాయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలన్నారు. వర్షం వల్ల వరి రంగు మారినా, మొలకెత్తినా, తేమ శాతంతో సంబంధం లేకుండా, కొర్రీలు పెట్టకుండా ధాన్యం కొనాలని డిమాండ్ చేశారు. హమాలీల కొరతతో ధాన్యం కొనుగోళ్లలో జాప్యం జరుగుతుందని, వెంటనే హమాలీలను ఏర్పాటు చేసి రైతుల వద్ద కొన్న ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలన్నారు. బీఆర్ఎస్ హయాంలో చల్‌గల్ యార్డులో 20 నుంచి 30 మంది హమాలీలు పనిచేశారని, ప్రస్తుతం 10 మంది కూడా దిక్కులేరన్నారు. కొనుగోళ్లు సరిగా లేకపోవడంతో అకాల వర్షం వల్ల రైతులకు నష్టం వాటిల్లుతుందన్నారు. దాదాపు గంటపాటు ధర్నా చేయడంతో వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోగా, అదనపు కలెక్టర్ బీఎస్ లత వచ్చారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ఈ ధర్నాలో చల్‌గల్, మోరపల్లి, హస్నాబాద్, జగిత్యాల రూరల్ రైతులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## నీళ్లల్లో ధాన్యం.. రైతన్న దైన్యం

- అకాల వర్షంతో తడిసిన వడ్లు
- ఆగమైన అన్నదాతలు

కోరుట్ల రూరల్/ కోనరావుపేట/ రుద్రంగి/ వీర్నపల్లి/ గంభీరావుపేట/ కథలాపూర్, మే 7 : అకాల వర్షాలు అన్నదాతను అతలాకుతలం చేస్తున్నాయి. బుధవారం తెల్లవారుజామున కురిసిన అకాల వర్షంతో కొనుగోలు కేంద్రాల్లో పోసిన ధాన్యం నీటి పాలైంది. జగిత్యాల జిల్లాలోని కోరుట్ల పట్టణం, రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలకేంద్రంతో పాటు నిజామాబాద్, మామిడిపల్లి, రుద్రంగి మండలం, వీర్నపల్లి మండలకేంద్రంతో పాటు అడవిపదిర, లాల్‌సింగ్‌తండా, వీర్నపల్లి, గర్జనపల్లి గ్రామాలు, గంభీరావుపేట మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలు, కథలాపూర్ మండలకేంద్రంలోని కొనుగోలు కేంద్రాల్లో పోసిన వరిధాన్యం వర్షానికి తడిసి ముద్దయింది. కొనుగోళ్లలో జాప్యం, టార్పాలిన్లు లేకపోవడంతో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరతో కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.



రుద్రంగి: కొనుగోలు కేంద్రంలో వర్షానికి కొట్టుకుపోయిన ధాన్యం



కోరుట్ల రూరల్: వ్యవసాయ మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యం



గంభీరావుపేట: జగదాంబ తండా కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం బస్తాలు



మాట్లాడుతున్న టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి

## సమ్మెను విజయవంతం చేయాలి

- టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి

గోదావరిఖని, మే 7 : కేంద్రం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 20న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి పిలుపునిచ్చారు. గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి కార్మికుల హక్కుల దృష్ట్యా సమ్మెకు పూర్తి మద్దతు ప్రకటిస్తూ 11 డిమాండ్లతో సమ్మె నోటీసులను సింగరేణి యాజమాన్యానికి అందించామని తెలిపారు. ప్రైవేటీకరణ ముంపు నుంచి సింగరేణిని కాపాడుకోవడానికి కార్మికులు పోరాటం చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. బొగ్గు బ్లాకలను సింగరేణికి కేటాయించాలని కోరారు. నాలుగు లేబర్ కోడ్‌లను, సింగరేణి సంస్థలో పెర్క్స్‌పై విధిస్తున్న ఆదాయపు పన్నును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 2016 జూలై 7 నుంచి అర్హులైన రిటైర్డు కార్మికులకు రూ.20 లక్షల గ్రాట్యుటీ చెల్లించాలన్నారు. సమావేశంలో నాయకులు మాదాసు రామ్మూర్తి, నూనె కొమురయ్య, పర్లపల్లి రవికుమార్, చల్లా రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.